విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 31 జులై 2025

8 పేజీలు

కనిపించని 104 వైద్య సేవలు

- గ్రామాల్లోకి వెళ్లని వాహనాలు -సచివాలయాలకే పరిమితం
- ప్రజల్లో అసంతృప్తి, అధికారులపై విమర్శలు
- భవిష్యత్తులో భరోసా కావాలంటే ప్రతి గ్రామానికి చేరాలి

విశాలాంధ్ర - కనిగిరి : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రవేశపెట్టిన 104 మొబైల్ హెల్త్ సర్వీసులు నేడు అసలు ఉద్దేశం తప్పిపోయినట్లు కనిగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వాస్తవ పరిస్థితులు చెబుతున్నాయి. గ్రామాల వరకు చేరాల్సిన వాహనాలు సచివాలయాల వద్ద ఆగిపోతున్నాయి. ప్రజలకు నిత్యం అవసరమైన వైద్య సేవలు, పరీక్షలు, మందులు అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

104 సేవల లక్ష్యం

104 హెల్త్ వాహనాలు ఒక మొబైల్ క్లినిక్ లాగా పనిచేసే విధంగా ప్రభుత్వం వాటిని రూపొందించింది. గ్రామాల్లోని దాదాపు ప్రతి కుటుంబానికి కనీసం నెలలో ఒకసారి వైద్య పరీక్షలు, జ్వర లక్షణాల పరిశీలన, డయాబెటిస్, బీపీ, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితి పరిశీలన, నిత్యవసర మందుల పంపిణీ వంటి 14 రకాల సేవలు అందించాలని ప్రభుత్వ మార్గదర్శకాలు చెబుతున్నాయి. కానీ ప్రస్తుతానికి కనిగిరి నియోజకవర్గంలోని వాస్తవ పరిస్థితి దానికి పూర్తి విరుద్ధంగా ఉంది.

వాస్తవంగా అందించాల్సిన సేవలు : వాహనం నేరుగా గ్రామానికి వెళ్లాలి. గ్రామంలో ఓపెన్ మిగతా 2 లో ...

సీఎం సభ ఏర్పాట్లు కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర దర్శి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల రెండో తేదీన దర్శిలో జరిగే అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేస్తున్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సరియా సభ ఏర్పాట్లను పరిశీలించారు. నగర పంచాయతీ పరిధిలోని శివరాజ్ నగర్ వద్ద హెలిపాడ్ ఏర్పాట్లను దర్శి మండలం తూర్పుగోదావరి పాలెం రాజంపల్లి కురిచేడు మండలం బోధనపల్లెలో అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి సభ నిర్వహణకు ఏర్పాట్లు పరిశీలించారు. వీరి వెంట సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరయ్య స్వామి, ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మి మాజీ శాసనసభలో నారపుశెట్టి పాపారావు, ఏంసి చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, కలవకలను చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వరదలతో అప్రమత్తం 2లో

కలెక్టర్ జె.వెంకటమురళి

వాహనాల పన్నుచెల్లింపునకు నేడు ఆఖరు 2లో

ఆర్టీఓ శ్రీ చందన

హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం 3లో

వాహనాల పన్నుచెల్లింపునకు నేడు ఆఖరు

- రేపటినుంచి స్పెషల్ డ్రైవ్ రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి
- ఆర్టీఓ శ్రీ చందన వెల్లడి

విశాలాంధ్ర-మార్కాపురం : వివిధ వాహనాలకు సంబంధించి త్రైమాసిక పన్ను చెల్లింపునకు నేడు ఆఖరు రోజు అని ఆగస్టు 1వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టి పన్ను చెల్లించని వాహనాలను సీజ్ చేసి ఫైన్ వేస్తామని మార్కాపురం ఆర్టీఓ శ్రీ చందన తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రెస్మీట్లో మాట్లాడుతూ జీపులు, కార్లు, టిప్పర్లు, బస్సులు, ట్రాక్టర్లు, ఇతర గూడ్స్, ప్రైవేటు వాహనాల యజమానులు అందరు కూడా ఈ నెల 31లోపు పన్నుచెల్లించాలని అన్నారు. సాధారణంగా ఇవన్నీ కూడా జూన్ 30లోపు చెల్లించాలని. ప్రభుత్వం జులై 30 వరకూ పన్ను చెల్లింపుకు అవకాశం ఇచ్చిందని తెలిపారు. వినియోగంలేని వాహనాలు ఏవైనా ఉంటే ట్రాన్స్పోర్టుకు సంబంధించిన వెబ్సైట్లో నమోదుచేస్తే ఫెనాల్టీ ఉండదని తెలిపారు. మార్కాపురం డివిజన్లో సుమారు 250 స్కూల్ బస్సులు ఉన్నాయని, జులై 12 నాటికి 97 బస్సులు మాత్రమే ఫిట్నెస్ సర్టిఫికేట్ తీసుకున్నాయని, మిగిలిన బస్సులకు తామే విచ్చేసి ఫిట్నెస్ ఇచ్చామని అన్నారు. ఇంకా డివిజన్ -వ్యాప్తంగా 30 స్కూల్ బస్సులు ఉన్నాయని, వాటికి వెంటనే ఫిట్నెస్ సర్టిఫికేట్ తీసుకోవడమా, వాడకపోతే తాము సమాచారం అందించడం చేయాలని అన్నారు. 15 సంవత్సరాలు దాటిన బస్సులను స్కూల్ పిల్లలను తీసుకెళ్లేందుకు వాడవద్దని అన్నారు. రోడ్డు భద్రతా ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా స్కూళ్లు, కళాశాలలు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసులతో కలిసి తమ సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఓవర్లోడ్తో వెళ్తున్న వాహనాలపై కూడా నిఘా ఉంచి ఫైనెవేస్తామని అన్నారు. మార్కాపురం ఆర్టీఓ కార్యాలయం ద్వారా 94 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని. వాహనాల యజమానులకు, డ్రైవర్లకు సేవలు, సమాచారం కావాల్సివస్తే నేరుగా తమను సంప్రదించాలని, ఎవరి మధ్యవర్తిత్వం వద్దన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగివుండాలని చెప్పారు. సమావేశంలో ఎంవీఐ మాధవరావు పాల్గొన్నారు.

మహిళలకు స్థిరమైన జీవనోపాధి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : స్వయం సహాయక సంఘాల మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించే లక్ష్యంతో సూక్ష్మరుణ ప్రణాళిక (మైక్రో క్రెడిట్ ప్లాన్), ఏసిఎల్పి పథకాలు అమలు చేయడం జరుగుతోందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్డి ఏ, వ్యవసాయ, పశు సంవర్ధక, సెరికల్చర్, చేనేత మరియు జౌళి శాఖ, పరిశ్రమలు, ఉద్యాన శాఖ, ఎల్డిఎం తదితర శాఖల అధికారులతో సమావేశమై స్వయం సహాయక సంఘాల మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించుటకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో స్వయం సహాయక సంఘాల మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా, స్థిరమైన జీవనోపాధి కల్పించేలా ఏపి శాఖలలో సబ్సిడీ యూనిట్స్ అమలు చేస్తున్నారో వారికి అవగాహన కల్పించి యూనిట్స్ ను వారికి అందచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా లో మొత్తం 45,297 స్వయం సహాయక సంఘాలు ఉండగా, 4,46,026 మంది సభ్యులు ఉన్నారని, వీరి జీవన ప్రమాణాలు మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీరిలో గుర్తించబడిన పి4 కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచేలా యూనిట్ల స్థాపనకు పొదుపు సంఘాల సభ్యులలో అవగాహన కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో చేపట్టాలన్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ, పట్టుశాఖ, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ మొదలగు శాఖల వారి వార్షిక సుస్థిర జీవనోపాధులు సంఘ సభ్యుల ద్వారా చేయుటకు సెర్ప్ తో సమన్వయము చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస రావు, జిల్లా సెరికల్చర్ అధికారి సంజయకుమార్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస రావు, ఎల్డిఎం రమేష్ కుమార్, జిల్లా చేనేత జౌళి శాఖాధికారి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ను మర్యాద పూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్ గఫార్

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరి మునిసిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలో బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆమెను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసినట్టు తెలియజేశారు. సందర్భంగా కనిగిరి నగర పురపాలక సంఘం అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయింపు, రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించారని తెలిపారు. కనిగిరి నగర పురపాలక సంఘం అభివృద్ధికి మౌలిక వసతుల పెంచాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పశుక్షేత్రంలో ఆవుల వేలం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని చదలవాడలోని ఒంగోలు జాతి పశుఉత్పత్తి క్షేత్రంలోబుధవారం ఆవుల వేలం నిర్వహించారు. ఈ వేలంలో 16 కోడెదూడలు, 16 పెయ్య దూడలు, 2 పెయ్యలు, 12 ఒట్టి ఆవులను వేలం వేసినట్లు క్షేత్రం పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు రవికుమార్ తెలిపారు. ఈ వేలంలో మొత్తం 70 మంది పాడి రైతులు పాల్గొన్నారు. తద్వారా రూ.9.24 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి శాఖ చైర్మన్ కోసూరి రాధ, ఉపసంచాలకులు జగత్ శ్రీనివాసరావు, నాగులుప్పలపాడు మండల పశువైద్యాధికారి బసవశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత వెలుగొండారెడ్డి మృతి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలకేంద్రమైన కొనకనమెట్లకు చెందిన సిపిఐ సీనియర్ నేత కామ్రేడ్ సురవరపు వెలుగొండారెడ్డి బుధవారం మృతి చెందారు. గ్యాస్ ట్రబుల్ కారణంగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య కొంతకాలం కిందట కాలం చెందినది. వెలుగొండారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు పూల సుబ్బయ్య కామ్రేడ్ సాని కొమ్ము కాశిరెడ్డి గుజ్జుల ఎల్లమందరెడ్డి పట్టా ఐజక్ ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. వెలుగొండ రెడ్డి మృతదేహం వద్ద పలువురు నాయకులు నివాళులర్పించారు.

వరదలతో అప్రమత్తం

కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - కొల్లూరు : కృష్ణా నదికి సంభవిస్తున్న వరదలలో అధికార యంత్రాంగం అప్రమత్తతతో వ్యవహరించి ప్రజలకు అవసరమైన సహాయకచర్యలపై దృష్టి కేంద్రీకరించి వారిని ఆదుకోవడానికి కృషి చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. బుధవారం కొల్లూరు మండలపరిషత్తు కార్యాలయంలో కృష్ణా నదికి వరదల సంభవిస్తున్న నేపథ్యంలో జిల్లా, మండల యంత్రాంగంతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు 87 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తూ గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలలో పాలుపంచుకోవాలని ఆదేశించారు. నీటి విడుదల గురువారం మధ్యాహ్ననికి 3 లక్షలకు పైబడి ఉండనున్న నేపథ్యంలో కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా భట్టిప్రోలు, రేపల్లె, కొల్లూరు మండలాల పరిధిలో 67 కిలోమీటర్ల పరిధిలో ఉన్న కరకట్ట ఎక్కడెక్కడ బలహీనంగా ఉందో తక్షణం గుర్తించి కృష్ణా నదికి నీటి ప్రవాహం పెరిగినా ఎటువంటి ఇబ్బందులు వాటిల్లకుండా బలోపేతం చేయాలని సూచించారు. కరకట్ట పరిశీలనకు ప్రతి రెండు కిలోమీటర్లకు సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. కరకట్ట దిగువున మూడు మండలాల పరిధిలోని 30 గ్రామాలలో 9 వేల గృహాలలో నివసిస్తున్న 30 వేల మందికి వరదల తీవ్రత అధికమైన సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 3 నెలలకు సరిపడా నిత్యావసర సరకులను ముందస్తుగా రేషన్ దుకాణాలకు తరలించి అందుబాటులో ఉంచాలని సివిల్ సప్లయ్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీటి వల్ల తీర ప్రాంత గ్రామాలకు ఎటువంటి ముప్పు లేకపోయినప్పటికీ, కృష్ణా నది ఎగువ ప్రాంతాలలో వర్షాలు పడి అకస్మాత్తుగా నీటి విడుదల పెరిగిన పక్షంలో ప్రజలను ఆదుకునేందుకు అవసరమైన సహాయక చర్యలను చేపట్టడంపై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి అమీర్ భాష, రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మి, రేపల్లె ఎమ్మార్వో శ్రీనివాసరావు, కొల్లూరు ఎమ్మార్వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కమలశ్రీ సూచించారు. బుధవారం ఆమె నాగులుప్పలపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నాగులుప్పలపాడు, అమ్మనబ్రోలు, తిమ్మసముద్రం, పోతవరం గ్రామాల ఆరోగ్యకేంద్రాల వైద్యులు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణులు, చిన్నారుల వివరాలను యూ విన్ పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీల సహకారంతో తగు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మురుగు కాలువల్లో ఆయిల్బాల్స్ వేయాలన్నారు. దోమలను నివారణపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాగులుప్పలపాడు సీనియర్ వైద్యాధికారి ఒనారియల్, వైద్యులు డాక్టర్ ప్రసన్న, కుమారస్వామి, హెల్త్ సూపర్వైజర్ శేషయ్య, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు ఆయా వైద్యశాలల సిబ్బంది పాల్గొన్నారు.

కనిపించని 104 వైద్య సేవలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంగణం లేదా స్కూల్ యార్డ్లో వాహనం నిలిపి ప్రజలకు పరీక్షలు నిర్వహించాలి. రోగి వివరాలు నమోదు చేసి, అవసరమైన పరీక్షలు చేసి, మందులు ఇవ్వాలి. ఆరోగ్య రికార్డులు భద్రపరచాలి.

కానీ ఇప్పుడు సేవలు అందిస్తున్న విధానం:

వాహనం గ్రామాల వద్దకు వెళ్లడం లేదు. సచివాలయం వద్ద ఆగి, పరిమిత మందులతో 'సింబాలిక్ సేవ'లకే పరిమితం అవుతోంది. పరీక్షలు చేయకుండానే మందులు ఇచ్చేస్తున్న ఉదంతాలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేటాయించిన రూ.3,22,359 కోట్ల రాష్ట్ర బడ్జెట్లో రూ.19,264 కోట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు బడ్జెట్లో కేటాయించి ఆరోగ్య శాఖకు పెద్దపీట వేసామని చెబుతుంటే అధికారులు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తూ గ్రామాలలో కనీసం 104 వైద్య సేవలను కూడా సక్రమంగా అందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, అనిమియా వంటి వ్యాధులు విస్తరించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఇది మరింత సమస్యాత్మకంగా మారే అవకాశముంది. 104 సేవలు సక్రమంగా పనిచేస్తే ముందస్తు నివారణ సాధ్యమవుతుంది. కానీ ప్రస్తుతం అది జరగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేశామని చెప్తుంటే అధికారులు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి గ్రామానికి నెలలో కనీసం ఒకసారి 104 వాహనం రావాలని, వైద్యుల పర్యవేక్షణ, అవసరమైన మందులు, పరికరాలు అందుబాటులో ఉండాలని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం, ముందస్తు వైద్య సేవలపై సంబంధిత వైద్య శాఖ అధికారులు, జిల్లా పరిపాలన యంత్రాంగం తక్షణమే స్పందించి గ్రామాలకు వైద్య సేవలు చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పంటల బీమా చెల్లింపునకు నేటితో ఆఖరు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : పంటలు బీమా చెల్లించుటకు నేడే ఆఖరు తేదీ అని యర్రగొండపాలెం మండల వ్యవసాయ శాఖ అధికారి కె.నీరజ తెలిపారు. బుధవారం యర్రగొండపాలెం మండలంలోని ఆమనిగుడిపాడు, వాదంపల్లి గ్రామాలలోని గ్రామ రైతు సేవ కేంద్రం నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సోదరులతో కలిసి ప్రస్తుతం సాగు చేస్తున్న పత్తి పంటలను క్షేత్రస్థాయిలో సదర్శించారు. సాగు చేసే ప్రతి ఒక్క రైతు తప్పకుండా ఈ పంట నమోదు చేయించుకోవలెను. ఈ పంట నమోదు చేపించుకున్న పంటలకు మాత్రమే చెల్లించిన బీమా ప్రీమియంలు వర్తిస్తాయని తెలిపారు. ఈ పంట నమోదు లేకుండా బీమా ప్రీమియం చెల్లించిన అటువంటి రైతులకు పీఎంఫసల్ బీమా యోజన వర్తించదు అని వివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఇఒ టి.పొట్టయ్య, డి.ధనేశ్వర్ నాయక్, విఏఏ కె. మంత్రు నాయక్, రైతులు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం

బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-కురిచేడు : కూటమి ప్రభుత్వము ఎన్నికల సమయంలో చెప్పిన వాగ్దానాలు చేసిన హామీలు నేటికీ కూడా నెరవేర్చకుండా తుంగలో తొక్కారని జిల్లా వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు, దరిశి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక దర్శి రోడ్డులోని గుంటగా నాసర్ రెడ్డి కళ్యాణ మండపము నందు జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి బాబు సూర్యుడి మోసం గ్యారెంటీ కార్యక్రమం గురించి వివరిస్తూ కూటమి ప్రభుత్వాన్ని అధికారములోనికి రావటానికి అమలు కాలేని సూపర్ సిక్స్ పథకాలు తెచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మోసం చేయడంలో ఆరితేరిందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల నాయకుడుగా అని ఏదైనా మాట ఇస్తే అమలుపరిచే దాకా శ్రమించి అమలు చేస్తారని అన్నారు. ప్రజా సమస్యల మీద పోరాడుతుంది అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రతి ఒక్కరూ గ్రామాల్లోకి వెళ్లి ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రతి ఒక్కరికి తెలియపరచాలని కోరారు ఎవరు ఎన్ని కుట్రలు పండిన 2029లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావటం తథ్యమని అన్నారు అక్రమ కేసులు పెట్టి కార్యకర్తలను నాయకులను జైల్లో పెట్టి వేధిస్తున్నారని ఏ కార్యకర్త అయిన భయపడకుండా పోరాడుతున్నారని అన్నారు.

మా ప్రభుత్వము వచ్చాక ఎవరిని మొదలుపెట్టే ప్రసక్తి లేదని వారి సంగతి చూస్తామని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీకి బలమని కార్యకర్తలను మేము ఎప్పటికీ విస్మరించమని అన్నారు కార్యకర్తలు లేనిది ఏ పార్టీ లేదని అన్నారు మా కుటుంబం మీద మీరు చూపిస్తున్న ప్రేమ ఆప్యాయతలు ఎప్పటికీ మరువమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సుబ్బయ్య యాదవ్ జడ్పిటిసి నాగిరెడ్డి జిల్లా ప్రధాన పార్టీ కార్యదర్శి కే.వి.రెడ్డి మన్నెం శ్రీధర్ మాజీ ఎంపీపీ వీర గంధం కోటయ్య మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ నాగేశ్వరావు

విశాలాంధ్ర-టంగుటూరు : 104 సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ నాగేశ్వరావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన టంగుటూరులోని వద్దెపాలెం సమీపంలో 104 అందిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 104 సేవలు గ్రామ గ్రామాలకు వెళ్లి గ్రామాలకు వైద్య సేవలు అందిస్తుందని డాక్టర్ నాగేశ్వర రావు తెలిపారు. అందులో భాగంగా టంగుటూరులోని టిటిడి కళ్యాణం మండపం పక్కన బుధవారం సేవలందించామని ఆయన తెలిపారు. ముసలి వాళ్లకు వృద్ధులకు వికలాంగులకు 104 సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరు ఈ సేవలో వినియోగించుకోవాల్సిందిగా వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందుల అందిస్తామని డాక్టర్ అన్నారు.

ఆర్టీసీ బస్సులో భారీ మొత్తంలో డబ్బు తరలింపు

విశాలాంధ్ర-టంగుటూరు : విజయవాడ-నెల్లూరు ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న భారీ మొత్తంలో డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బుధవారం ఉదయం ప్రకాశం జిల్లా టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఓ బ్యాగును పరిశీలించగా అందులో రూ.49.45 లక్షల నగదును గుర్తించి నగదును పోలీసుల స్వాధీనం చేసు కున్నారు. తాడేపల్లిగూడెనికి చెందిన మణికంఠను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ నాగమల్లేశ్వరావు తెలిపారు.

నేడు టంగుటూరికి మందకృష్ణ

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని అరుంధతి నగర్‌కు చెందిన గర్నిపూడి సుబ్బారావు రెండో కుమారుడైన నీరజ్ ఈ నెలలో గుండెపోటుతో మరణించడంతో తెలుసుకున్న ఎంఆర్పిఎస్ వ్యవ స్థాపకులు పద్మభూషణ గ్రహీత మంద కృష్ణ మాదిగ గురువారం గుండెపోటుతో మరణించిన నీరజ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్నారని ఎంఆర్‌పిఎస్ నాయకులు తెలిపారు. కావున ఎమ్మార్పిఎస్ నాయకులు, అభిమానులు సాయంత్రం మూడు గంటలకు అధిక సంఖ్యలో తరలిరావాలని బుధవారం బక్కా సుదర్శన్ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు.

పత్రాలు లేని వాహనాలు సీజ్

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని ఒంగోలు డిఎస్పి ఆధ్వర్యంలో పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో డి.ఎస్.పి రాయపాటి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాలనీలో పరిశీలించారు. సరైన పత్రాలు లేని బైకులను వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది 400 గృహాలలో శోదాలను నిర్వహించారు. అంతేకాకుండా పత్రాలు లేని 25 వాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట స్థానిక ఎస్ఐ నాగమల్లేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సాకారంతో నిత్యాన్నదానం

విశాలాంధ్ర - గిద్దలూరు : దాతల సహకారంతో నిత్య అన్నదానాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు బివిస్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కాశి నాయన సత్రంలో ఉచిత అన్నాదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు మాసాలుగా ప్రతి బుధవారం భోజనం ఏర్పాటు చేస్తున్నామని త్వరలో నిత్య అన్న దానం చేసేందుకు దాతలు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి మల్లారెడ్డి పూనూరు హనుమంత రెడ్డి వీరారెడ్డి పాలుగుళ్ళ కాశిరెడ్డి లింగారెడ్డి ప్రసూన అమ్మయ్య మాజీ సర్పంచ్ రమణమ్మ బాల నర్సమ్మ చిన్నక్క ఓబులపతి కాశినాయన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంటలకు బీమా చేసుకోవాలి

తర్లుపాడు వ్యవసాయ అధికారి పి.జోష్నాదేవి

విశాలాంధ్ర - తర్లుపాడు : తర్లుపాడు మండలంలోని పోతలపాడు, కందలపల్లి గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయ అధికారి పి.జోష్నాదేవి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పంటల బీమా పథకానికి జులై 31వ తేదీ ఆఖరి తేదీగా ఉన్నందున రైతులు పంటల బీమా చేయించుకోవలసినదిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన శాఖ అధికారి సాయిరాం, ఎంపిఈఓ రాధ,వెటర్నరీ అసిస్టెంట్ గురవయ్య, కందలపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులు రాయితీలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - సంతనూతలపాడు : ఉద్యాన రైతులకుప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన రాయితీలను వినియోగించుకోవాలని పొదిలి నుంచి బదిలీపై ఒంగోలు సబ్ డివిజన్ వచ్చిన ఉద్యాన అధికారి డి.సంధ్య అన్నారు. మండలంలోని పి తక్కెళ్ళపాడు బుధవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని రైతులు ఉద్యాన పథకాలు వినియోగించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచకులు ప్రసన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు టీడీపీ నేతల నివాళి

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని బోదవాడ నీటి సంఘం అధ్యక్షులు వెల్లంకి శివయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన దశదినకర్మ బుధవారం బోడోవాడ గ్రామంలో నిర్వహించారు. పామూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, టిడిపి సీనియర్ నాయకులు అడుసు మల్లి ప్రభాకర్ చౌదరి, మాజీ ఎంపీపీ గుంటుపల్లి దశరథ రామయ్య, మాపాడు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య లు దశదినకర్మలో పాల్గొని శివయ్య చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కోటిలింగం, రమణయ్య, కనకాద్రి తదితరులు నివాళులు అర్పించారు.

పేరుకే సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం పేరుకే తూ తూ మంత్రముగా జరిగింది. సమావేశానికి ఎంపీపీ బి.విజయ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులను ఎంపీటీసీలను అధికారులు కలుపుకొని పోవాలని కోరారు. ఎంపీడీఓ డి.సురేష్ బాబు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ పాటు పడాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ శాఖల గురించి సమీక్ష వివరించారు. మండల తాసిల్దార్ ఎస్ ఎల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆధార్ కార్డులలో తప్పులు దొర్లిన వారు వాటిని వెంటనే సరి చేయించుకోవాలని కోరారు. అలాగే ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి అర్హులైన వారికి ఒక్కొక్కరికి 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆయన తెలిపారు. ఎంఈఓ డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు బ్యాగులు షూస్ అంద జేశామని తెలిపారు. విద్యార్థులందరికీ తల్లికి వందనం ఇవ్వడం పూర్తయిందని ఆయన తెలిపారు.

పంటల నమోదుతోనే బీమా

విశాలాంధ్ర - గిద్దలూరు : గిద్దలూరు మండలంలో ముండ్లపాడు, బురుజుపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్‌కి సంబంధించి ఈ పంట నమోదు కార్యక్రమం జరుగుతుంది. కావున రైతులు అందరూ తప్పనిసరిగా ఖరీఫ్ సీజన్లో వేసిన ప్రతి ఒక్క పంటను నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ -పంట నమోదు చేసుకోవడం వలన అతివృష్టి మరియు అనావృష్టి వచ్చినప్పుడు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ద్వారా అందించే నష్టపరిహారం, పంటల బీమా, మద్దతు ధర మరియు సున్నా వడ్డీ తదితర ప్రభుత్వ సహాయలు అందాలంటే తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకొని ఉండాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు స్వతహాగా వారే పంట బీమాకి రైతు వాటా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ సీజన్‌లో ప్రకాశం జిల్లాలో వరి, కంది, సజ్జ, నువ్వులు, మినుములు, పత్తి మరియు ఎండు మిరప మొదలైన పంటలు పంటల బీమా పథకం కింద వర్తిస్తాయని తెలిపారు. గ్రామ సభ అనంతరం మొక్కజొన్న, ఆముదం మొదలైన పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలన గావించి ఆ పంటలలో వచ్చు చీడ పీడలు, వాటి నివారణ చర్యలు రైతులకు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సిద్దయ్య, కిరణ్ పాల్గొన్నారు.

జనసేవాదళ్‌లో యువత పాత్ర కీలకం

కె.వి.వి ప్రసాద్

విశాలాంధ్ర-త్రిపురాంతకం : 28వ రాష్ట్ర మహా సభలో జరుగు జనసేవాదల్‌లో యువత పాత్ర కీలకమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ ఆగస్టు 1 నుండి 3 తేదీ వరకు ఒంగోలు కేంద్రంలో జనసేవాదల్ శిక్షణ తరగతులలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలన్నారు. అక్కడ ఇచ్చే శిక్షణలో శ్రద్ధగా నేర్చుకొని మహాసభలో ప్రదర్శన చేయాలన్నరు. దేశం భవిత మొత్తం విద్యార్థులపై ఆధారపడి ఉందన్నారు. దేశంలో జరుగు అక్రమాలను ఎప్పటికీ అప్పుడు తెలుసుకొంటూ సమాజంలో తెలిసేలా కృషి చేయాలన్నారు. ఒంగోలు లో జరుగు సీపీఐ శతజయంతి ఉత్సవాలలో 100 గొంతులు, 100 కళలు భారీ ప్రదర్శన జరుగుతుంది అన్నారు. ఈ భారీ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి శ్రీనివాస్, నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, పుల్లల చెరువు కార్యదర్శి గురునాదం, శాఖ కార్యదర్శి ముసలయ్య, కొండలు, మరికొందరు యువకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి వర్కర్లకు శిక్షణ

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక సచివాలయం నందు ఎఫర్ట్ ఆధ్వర్యంలో అంగన్వాడి సూపర్వైజర్ సునీత అధ్యక్షతన అంగన్వాడి వర్కర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ టీం సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థటీం జెస్సి గ్లోరీ మాట్లాడుతూ ఎఫర్ట్ సంస్థ నుండి 22 గ్రామాలలో పనిచేస్తూ మహిళలకు యొక్క ఆరోగ్య పోషకాహారం గురించి గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పోషకాహారం తీసుకోవాలని అందుకు గాను గ్రామాల్లో ఆసక్తిగా ఉన్న మహిళలకు పెరటి తోటల పెంపకమును ఏర్పాటు చేసుకొనుటకు ముందుకు వచ్చిన వారికి రిలయన్స్ పోషకాహారం వనం కొరకు ఆకుకూరలు విత్తనాలు, కూరగాయల విత్తనాలను వారికి సపోర్టుగా అందించుచున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సునీత 41 సెంటర్ల అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : రైతులు తాము వేసిన వివిధ రకాల పంటల వివరాలను ఈ క్రాఫ్ బుకింగ్‌లో పంట నమోదు చేయించుకోవాలని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కే.బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని ఉమామహేశ్వరపురం, నాయుడుపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన కౌలు రైతులందరూ మీ గ్రామాలలో గల వీఆర్వో లను కలిసి కౌలు పత్రం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ అఫ్రీన్, శ్రీదేవి, అబ్దుల్ రజాక్, రైతులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి

విశాలాంధ్ర -కంభం : మోటార్‌పై వెళుతూ అదుపుతప్పి నాగేళ్ల పవన్ (25) మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఈ సంఘటన మండలంలోని చిన్న కంభం గ్రామసమీపంలోని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా జరిగింది. సమాచారం మేరకు నల్లకాల్వకు చెందిన పవన్ కంభంలోని వై.జంక్షన్‌లో టీ స్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు సొంతగ్రామం నల్లకాల్వ నుండి ప్రతి రోజు వచ్చి రాత్రి వేళల్లో గ్రామంకు వెళ్లే క్రమంలో మంగళవారం రాత్రి అదుపుతప్పి గుడిఎదురుగా వున్నరోడ్డు కల్వర్టుకు గుద్దటంతో ప్రమాదం జరిగి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. బుధవారం మృతదేహాన్ని కంభం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

దివ్యాంగులకు అన్నదానం

విశాలాంధ్ర- కనిగిరి : పట్టణంలోని ఎస్‌కేఆర్ మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల నందు బుధవారం చిట్యాల వెలుగొండారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలానే విజయభాస్కర్ రెడ్డి విద్యార్థులను, మరియు ఆ పాఠశాల ఉపాధ్యాయులను సమస్యల గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి, బన్నీ, గురు ప్రసాద్, బ్రహ్మారెడ్డి, వెంకీ, నాని మరియు తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించండి

విశాలాంధ్ర - గిద్దలూరు : జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన పశ్చిమ ప్రకాశం వైపు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటింగ్ సభ్యుడు గిద్దలూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కత్తి అనోజీరావు కోరారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్‌ను కలిశారు. జిల్లా ఎస్సీ ఎస్టీ మాంటింగ్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా ఆయన ఎస్కుటీ డైరెక్టర్ అర్జున్ నాయక్ తో మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ రుణాలను ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ప్రాధాన్యత పశ్చిమ ప్రకాశంకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దప్పు చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోల ప్రసన్న అర్ధవీడు మండల అధ్యక్షుడు దున్న యోబు తదితరులు ఆయన కలిసిన వారిలో ఉన్నారు.

పెట్రోలు బంకు, రేషన్ దుకాణాలు పరిశీలన

విశాలాంధ్ర -తాళ్లూరు: మండల కేంద్రంలోని ఎంఎన్ఆర్ పెట్రోలు బంకును, రజానగరంలో రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ బివి రమణా రావు పరిశీలించారు. ఫిల్లింగ్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నాణ్యతను, క్వాంటిటిలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. రజానగరంలో రేషన్ దుకాణాన్ని పరిశీలించి సమయ పాలన పాటించాలని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వీఆర్ఓ చంద్రశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మారెడ్డిపల్లిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

విశాలాంధ్ర- కనిగిరి: హెచ్ఎం పాడు మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మాజీ మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ గాయం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ సంవత్సర కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో బూత్ నెంబర్ 20.19లలో డోర్ టు డోర్ ప్రోగ్రాం కంప్లీట్ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.టి.ఆర్, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొనడం జరిగింది.

మానవ అక్రమ రవాణాని అరికట్టాలి

ఎంఈఓ జి.కరుణకుమారి

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మానవ అక్రమ రవాణాను ప్రతి ఒక్కరూ అరికట్టాలని ఎంఈఓ జి కరుణ కుమారి అన్నారు. బుధవారం స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కరుణ కుమారి మాట్లాడుతూ ఆర్థిక ప్రయోజనాల కోసం మనుషులను అంగడి సరుకులుగా మార్చి క్రయ విక్రయాలు జరపడాన్ని మానవ అక్రమ రవాణా, హ్యూమన్ ట్రాఫికింగ్ అంటారని తెలిపారు. ఇది అత్యంత దుర్మార్గమైన మానవ హక్కుల ఉల్లంఘన, ప్రధానంగా లైంగిక దోపిడీ, వెట్టి చాకిరి, బానిసత్వం రూపాల్లో ఉంటుందన్నారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఎంఈఓ

విశాలాంధ్ర - తాళ్లూరు: వెలుగు వారి పాలెం ప్రాథమిక పాఠశాల (ఎ.ఎ)ను మండల విద్యాశాఖాధికారి - 1 గురజాల సుబ్బయ్య బుధవారం అకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల సామర్థ్యాలను, వర్క్ బుక్స్‌ను తనిఖీ చేసారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. రెండవ తరగతి విద్యార్థులకు తగని పందెం కథ, కాకి - హంస పాఠ్యాంశం బోధించి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. శ్రద్ధతో చదివిచే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. పాఠశాలను పరిశీలించి పచ్చదనాన్ని ప్రోత్సహిస్తున్న హెచ్ఎం సుబ్బారెడ్డిని, గ్రీన్ పాస్ పోర్టు అందుకున్న విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు పరకాల మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకును పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని శంకరాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జియో పెట్రోల్ బంకు కొరకు అనుమతులు ఇచ్చేందుకు గాను ఒంగోలు ఆర్డీవో కే లక్ష్మీ ప్రసన్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన పెట్రోలు, డీజిల్ అందించి మెరుగైన సేవలు అందించాలన్నారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ, విఆర్ఓ సుజాత, బంకు యజమాని మందలపు వెంకటరావు, చుంచు నారాయణ పాల్గొన్నారు.

మానవతా సంస్థలో సభ్యత్వం స్వీకరణ

విశాలాంధ్ర-పామూరు : మానవతా స్వచ్ఛంద సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై సభ్యత్వం రెన్యువల్ ప్రారంభించిన మొదటి రోజు వందమంది సభ్యత్వం స్వీకరించినట్లు ఆ సంస్థ అధ్యక్షులు వెండిదండి వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం సంస్థ చైర్మన్ కల్లూరి రామిరెడ్డి, బైరెడ్డి జయరామిరెడ్డి, బోయాళ్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు.

లింగారెడ్డి కాలనీలో పాఠశాలకు

భవన నిర్మాణం ఎప్పుడు..

కాంగ్రెస్ నేత షేక్ మహబూబ్ వలి

విశాలాంధ్ర - తర్లుపాడు : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయిలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా, తర్లుపాడు మండలంలోని లింగారెడ్డి కాలనీలో ప్రజలు, దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్ వలి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హుస్సేన్ నేతృత్వంలో బుధవారం సందర్శించారు. కాంగ్రెస్ జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి మహబూబ్ వలి మాట్లాడుతూ లింగారెడ్డి కాలనీలో 70 కుటుంబాలు పైగా నివాసం ఉండగా, వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ప్రభుత్వ పాఠశాల భవనం లేకపోవడం అని అన్నారు. గత రెండు దశాబ్దాలుగా ఈ సమస్య అలాగే కొనసాగుతోందని, కాలనీవాసులు తమ గోడును వినిపించారనీ చెప్పారు. పిల్లల విద్య కోసం ఎటువంటి సౌకర్యాలులేని పరిస్థితిలో, ప్రస్తుతం చర్చిలోనే తాత్కాలికంగా బోధన కొనసాగించబడుతోందని అన్నారు.

మెస్ బిల్లులు,కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలి

- ప్రభుత్వ హాస్టళ్ల లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి
- హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి
- వైయస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హాస్టళ్లో సందర్శన
- వైఎస్సీపీ జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు యల్లావుల సోహిత్ యాదవ్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రభుత్వ హాస్టళ్లకు పెండింగ్ లో ఉన్న మెస్ బిల్లులు కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు యల్లావుల సోహిత్ యాదవ్,రాష్ట్ర విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీ షేక్ పర్వేజ్‌లు అన్నారు. వైయస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల సందర్శన కార్యక్రమంలో భాగంగా బాపట్ల పట్టణంలోని బిసి హాస్టల్ ను సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు యల్లావుల సోహిత్ మాట్లాడుతూ పట్టణంలో విద్యార్థులతో కలిసి విద్యార్థుల యొక్క సమస్యలను స్వయం గా అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లాలో చాలా హాస్టల్లో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని వాటికి నిధులు కేటాయించి సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. చాలా హాస్టల్లో విద్యార్థులకు సరిపడ గదులు లేక ఒక్కొక్క రూమ్ లో 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటున్న పరిస్థితి ఈ జిల్లాలో నెలకొందని విద్యార్థులకు ఇస్తున్న కాస్మోటిక్ ఛార్జీలు మాత్రం పెంచడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెను ఏమో పెంచింది కానీ వాళ్లకు ఇస్తున్న మెస్ ఛార్జీలు పాత పద్ధతుల్లోనే ఇస్తే విద్యార్థులకు హాస్టల్ వార్డెన్లు నాణ్యమైన ఆహారాన్ని అందించలేరని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు విడుదల చేసి పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉన్న బీసీ హాస్టల్ కి సొంత భవనం లేక ఇబ్బంది పడుతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి బాపట్ల టౌన్ లో ఉన్న బీసీ హాస్టల్ గవర్నమెంట్ భవనాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా విద్యార్థి భాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వార్డు కేటాయించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : టీబీ వ్యాధిగ్రస్తులకి ప్రభుత్వ వైద్యశాల ప్రత్యేక వార్డు కేటాయించాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుదె రాజారావు అన్నారు.బాపట్ల ప్రభుత్వ వైద్యశాల నందు అనారోగ్యం తో వచ్చే రోగులకు టీబీ వ్యాధి సోకే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు తీసు కోవాలని తెలిపారు.టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికా హారం కిట్లు పంపిణీ చేయటం చాలా మంచిదని టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేసిన బాపట్ల ఏరియా వైద్యశాల సూపరిటెండెంట్ సిద్ధార్థకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.టీబీ అంటువ్యాధి అని పేషంట్ల వార్డులోనే టిబీ పేషెంట్లు కూడా ఉంచడం వల్ల ఆ రూములో ఉండే పేషెంట్లకు మొత్తం టిబీ వ్యాధి సోకే అవకాశం ఉందని టిబీ పేషెంట్లుకు ఒక వార్డు కేటాయించా లని బహుజన సమాజ్ పార్టీ తరుపున కోరారు.

స్వామిత్వ సర్వేపై శిక్షణ ప్రారంభం

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండలంలోని పంచాయితీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు స్వామిత్వ సర్వేపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమమును జె పంగులూరు ఇన్చార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే సుమంత్ బుధవారం ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమం ఉద్దేశించి ఇంచార్జి ఎంపీడీవో మాట్లాడుతూ స్వామిత్వ సర్వే చాలా ముఖ్యమైనదని కనుక శిక్షణ తరగతులలో చెప్పిన విషయాలు అన్నీ అవగతం చేసుకొని సర్వే పారదర్శకంగా, నిజాయితీగా, సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల, సచివాలయాల పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

వైసీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి మాచవరపు రవికుమార్

విశాలాంధ్ర - పర్చూరు : రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో కూటమి ప్రభుత్వం మౌలిక వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించాలని వైసీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి మాచవరపు రవికుమార్ కోరారు. బుధవారం పర్చూరులోని ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలోని వసతి గృహాన్ని సందర్శించి సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేశామని తెలిపారు.అనంతరం విద్యార్థులతో సమావేశమై వసతి గృహంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి స్వయంగా విద్యార్థులను అడిగి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం వసతి గృహాన్ని సందర్శించామని రవికుమార్ తెలిపారు. విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం వస్తే హాస్టల్ చుట్టుపక్కల వర్షం నీరు నిలవడం వలన హాస్టల్లోకి విష సర్పాలు, దోమలు, పురుగుల వలన పిల్లలు చదువుకోలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం గవర్నమెంట్ బిల్డింగ్ లోకి ఎస్టీ గురుకులం హాస్టల్ మార్చాలని విద్యార్థులు అభ్యర్థిస్తున్నారని కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామని రవికుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కుమ్మరి చందు, నియోజకవర్గ యువనాయకులు బిల్లా అశోక్ కుమార్, అరుణ్, దాసు, విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - యద్దనపూడి : గత ఆరు సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న గ్రామస్తులకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు చొరవతో తాగునీటి సమస్య పరిష్కార మవుతుందన్నారు. మండలంలోని అనంతవరం గ్రామానికి తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. బోర్లు వేసినప్పటికీ ఉప్పు నీరు తప్ప మంచి నీరు పడవు. ఈ గ్రామంలో తాగునీటి చెరువులకు మీరు చేరాలంటే బొప్పేపల్లి దగ్గర ఉన్న సాగర కాలువ నుంచి రావాలి, 40 సంవత్సరాల క్రితం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైను ఆధారం, అనంతవరం, చిలుకూరి వారి పాలెం, వింజనంపాడు, యనమదల, యద్దనపూడి గ్రామాలకు తాగునీరు చేరేవి. పైపులైను యనమదల సమీపంలో కుంగి తాగునీరు సక్రమంగా చెరువులకు చేరడం లేదు. ఇటీవల కాలువకు మరమ్మతు చేయించారు. గత ఆరు సంవత్సరాల నుండి తాగునీటి సమస్య ఉండటం తో గ్రామ నాయకులు గుదే తారక రామారావు , కొరటాల వంశీకృష్ణ లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువచ్చారు. నీటి సమస్యను వివరించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి, డిఎంఎఫ్ నిధులు రూ. 10,00,000 మంజూరు చేయించగా పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా పాత ఫిల్టర్ బెడ్ లను, ఇసుక, ముక్క, ఇటుకలను తొలగించి నూతనంగా మెటల్ ,ఇసుక, ఇటుక లు ఏర్పాటు చేస్తున్నారు. . ఈ కార్యక్రమంలో గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ,మానుకొండ రామేశ్వరరావు, గుత్తా వాసుబాబు, పోపూరి సాంబశివరావు , ఆరికట్ల సాంబశివరావు, పోపూరి హనుమంతరావు పెదవల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలి: సునీత

విశాలాంధ్ర - పర్చూరు : బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలులో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఏపీ ఎస్ డబ్ల్యూసి వేర్ హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ సునీత స్పష్టంచేశారు. పర్చూరు మండలంలో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. పర్చూరు మండలంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డు గోదాము, ఎస్ డబ్ల్యూసి గోదాములను ఆమె పరిశీలించారు. బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలు, గోదాముల్లో నిల్వ చేసిన పొగాకును ఆమె పరిశీలించారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న బ్లాక్ బర్లీ పొగాకును భద్రంగా నిల్వ చేయాలని ఎండి సునీత తెలిపారు. ముందస్తుగానే గోదాములను ఎంపిక చేసుకుని వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. ఆమెతో పాటు మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు, తదితరులు ఉన్నారు.

కోటపాడులో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం కొండ మంజులూరు, కోటపాడు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి డి. సుబ్బారెడ్డి పాల్గొని పొలం పిలుస్తోంది గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత పొందిన ఈకేవైసీ చేయించుకొని వారి జాబితా రైతు సేవ కేంద్రం వద్ద ఉన్నదని 221 మంది రైతు సేవలో కేంద్రములో కలిసి ఈ కెవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఆధార్‌కి బ్యాంక్ ఖాతా లింక్ చేయించుకోని జాబితాలో పేర్లు చూసుకొని వెంటనే బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ చేయించుకోవాలని తెలిపారు ఈనెల 31 లోపు, వరి పంట ఆగస్టు 15 లోపు బ్యాంకులో లోన్ తీసుకునేవారు రైతు సేవ కేంద్రంలో కలిసి పంట సాగు ధృవీపత్రం తీసుకొని మీ సేవ కేంద్రంలో కలిసి బీమా చెల్లించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో కొండ మంజులూరు సొసైటీ అధ్యక్షులు బత్తుల వెంకట్రావు, కోటపాడు సొసైటీ అధ్యక్షులు రావుల సింగరకొండ, నాయకులు చింతలసహదేవు, గద్దం నాగేశ్వరరావు,వ్యవసాయ సహాయకులు పవిత్ర,రోజి, రైతులు పోల్గొన్నారు.

నేడు ఊర అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని చింతపల్లి పాడు గ్రామంలో నేడు ఊర అంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాకులు జంపని మోహన్‌రావు, జంపని వాసు, జంపని శ్రీనివా సరావు తెలిపారు. కావున గ్రామంలోని భక్తులు పాల్గొని అమ్మవారి పూజా కార్యక్రమాలు తిలకించాలని, అనంతరం అన్నదాన కార్యక్రమ నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఈ సంవత్సరం 150 మందికి పైగా విద్యార్థులు పదో తరగతి చదువుతుండగా వారికి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణు గోపాలరావు, అవ్వారు సుజాత, వి. జయంతి ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని ద్వారా బుధవారం అందించారు. మెటీరియల్ తయారుచేసిన పల్నాడు జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మిరియాల శివశంకర్ టీమ్‌కు విద్యార్థులు ధన్యవాదములు తెలియజేశారు.

పేదలకు నివేశన స్థలాలు కేటాయించాలి

- తహశీల్దారును కలిసిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర - చీరాల టౌన్ : అర్హులైన పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తహశీల్దారు గోపీకృష్ణని కలిసిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ ఎన్నో నెలల నుంచి ఎంతో మంది పేద ప్రజల తరపున ఇళ్ల స్థలాల కోసం అర్జీలు ఇస్తున్నా ప్రభుత్వం స్పందించిన దాఖలాలు లేవన్నారు. పేదలు ఇస్తున్న అర్జీలు అన్నీ పక్కన పెడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. సచివాలయ కార్యదర్శులు చుట్టూ తిరుగుతుంటే పట్టించుకోవటం లేదన్నారు. ప్రభుత్వం స్పందించ కపోతే ఆర్డీవో కార్యాలయం వద్ద వందలాది మందితో ధర్నాకు దిగుతామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ చీరాల నియోజకవర్గ కార్యదర్శి బాసి పైడియ్య,సీపీఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి కోలా వీరాంజనేయులు,సీపీఐ చీరాల మండల కార్యదర్శి సైకం రాజశేఖర్ పాల్గొన్నారు.

సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని పశు పోషకులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు ఇస్తున్నట్లు అద్దంకి పశుసంవర్ధక శాఖసహాయ సంచాలకులు డాక్టర్ బ్రహ్మయ్య బుధవారం తెలిపారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 20 కేజీల వరకు ఇస్తున్నట్లు తెలిపారు. అద్దంకి మండ లానికి 7 క్వింటాళ్ల విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. పశుగ్రాసం విత్తనాలు కావాల్సినవారు అద్దంకి పశు వైద్యశాలలో రాయితీ డబ్బులు చెల్లించి తీసుకుపోవాలన్నారు. అవకాశాన్ని మండలంలోని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మండలం సింగరకొండకు చెందిన గర్భిణీ మల్లవరపు భవాని (20) కి అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం ఎక్కించవలసినదిగా వైద్యులు సూచించగా భవాని కుటుంబ సభ్యులు స్థానిక రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ చుండూరి మురళీ సుధాకరరావుని సంప్ర దించారు, ఆయన స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద పండ్ల వ్యాపారి షేక్ ఖాజావలి (52)ని ప్రోత్సహించి బుధవారం రక్తదానం చేయించారు. మురళీ సుధాకరరావు ప్రోత్సాహించిన 455 వ రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య పాల్గొని రక్త దాత ఖాజావలిని , మురళీ సుధాకరరావుని అభినందించారు.

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-సి ఎస్ పురం : కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో టి.ఆశ బిఎస్సీ డిగ్రీ పూర్తి చేసి శ్రీ వెంకటేశ్వర వ్యవ సాయ కళాశాల తిరుపతిలో ఎంఎస్సీ ఎక్స్ టెన్షన్ విభాగంలో అడ్మిషన్ పొంది అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విశ్వవిద్యాలయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది. ఇటీవల జరిగిన స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, చైర్మన్ కదిరి ప్రకాష్‌రావు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ పార్థ సారథి, కళాశాల డీన్ డాక్టర్ పి. వీరన్న గౌడ్, అధ్యాపకులు అభినందించారు.

ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-సి ఎస్ పురం : ప్రజా శ్రేయస్సు తమ ప్రభుత్వ లక్ష్యమని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బోయళ్ల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద రాజుపాలెం గ్రామంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు సూ చనలతో తెలుగుదేశం పార్టీ కార్య కర్తల ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మొదటగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలని అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు అనంతరం పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్, తల్లికి వందనం, దీపం పథకం, తదితర సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తోందన్నారు. అంతేకాకుండా అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర వాటిని త్వరలోనే అమలు చేస్తుందని ప్రజలకు తెలియచెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దాసరి మల్లికార్జున, టిడిపి నాయకులు దర్శి ఆదినారాయణ, మాజీ జెడ్పిటిసి దర్శి నాగేశ్వరరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు దర్శి కృష్ణయ్య, యనమల రమణారెడ్డి, రేనాటి వెంకటేశ్వర్లు, సీతారామయ్య, మండల ఐటీడీపీ కోఆర్డినేటర్ మాదినేని శ్రీనివాసులు, పోలయ్య, ఏసోబు కేవన్ఆర్ జేమ్స్, పులి రాజశేఖర్, చీపు శ్రీను, మితికాల సత్యం, మితికాల చిన్నమాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ల్లో వీల్‌చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - చీరాల టౌన్ : పోలీస్ స్టేషన్‌లో వీల్‌చైర్లు ర్యాంపులు ఏర్పాటు చేయాలని చీరాల డీఎస్పీని వికలాంగుల హక్కుల సంఘం ప్రతినిధులు కలిసి విజ్ఞప్తి చేశారు. చీరాల డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో దివ్యాంగులకు అనుకూలంగా వీల్‌చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని కోరుతూ నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి ప్రతినిధులు మంగళవారం డీఎస్పీ మొహమ్మద్ మొయిన్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా మాట్లా డుతూ దివ్యాంగులు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చినప్పుడు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అధికంగా ఉన్నాయని గుంటూరు రేంజ్ ఐజీ ఇప్పటికే వీల్‌చైర్లు, ర్యాంపుల ఏర్పాటు పై ఆదేశాలు జారీ చేసినా ఇప్పటికీ అమలు కాలేదన్నారు. వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో పూర్వపు ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లుకు ఐజీ ఆదేశాలతో వినతిపత్రం ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఇది జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం–2016ను ఉల్లంఘించడ మేనన్నారు.వీల్‌చైర్లు, ర్యాంపుల ఏర్పాటుకు అవసరమైన నిధులను బాపట్ల జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ద్వారా సమకూర్చవచ్చని, అధికారులు స్పందించ కపోవడం వల్ల వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమేష్,జిల్లా అధ్యక్షులు ఇరుపని వెంకటేశ్వర్లు,పరణం అనిల్ నాయుడు,గుడిపాటి రవితేజ పాల్గొన్నారు.

బధిరుల విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల : మండలంలోని వెదుళ్ళపల్లిలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఎస్సై భాగ్యరాజ్ మంచి స్పర్శ, చెడు స్పర్శల గురించి, స్త్రీ భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ గురించి, అత్యవసర టోల్ ఫ్రీ నంబర్ల గురించి వారికి అర్థమయ్యే రీతిలో బధిరుల సంకేత భాషలో, దృశ్య పాఠాల రూపంలో అవగాహన కల్పించారు.విద్యార్థులకు వ్యక్తిగత హద్దుల గురించి అనుచిత ప్రవర్తనను ఎలా గుర్తించాలో వివరించారు. అవసరమైన సమయంలో ఎవరి సహాయం పొందాలో వివరించారు. బాల్య వయసు పిల్లలపై లైంగిక నేరాల నివారణ చట్టం గురించి ప్రాథమిక సమాచారం ఇచ్చారు. ఈ చట్టం విద్యార్థుల హక్కులను ఎలా రక్షిస్తుందో వివరించారు. మహిళల కోసం రూపొందించిన శక్తి యాప్ ను ఎలా ఉపయోగించాలో వివరించారు. అత్యవసర సమయంలో దీనిని ఉపయోగిస్తే నిమిషాల వ్యవధిలో పోలీసులు చేరుకొని రక్షణ కల్పిస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో డయల్ 112: ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో అయినా 112/100 నంబర్లకు కాల్ చేయాలని విద్యార్థులకు సూచించారు.దివ్యాంగులైన విద్యార్థుల భద్రత కల్పించడం కోసం పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఎస్.ఐ వివరించారు.

సాంస్కృతిక స్మారక చిహ్నాలు, ప్రదేశాలు పునరుద్ధరణపై మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు: గత 5 సంవత్సరాలలో, దేశం,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సాంస్కృతిక స్మారక చిహ్నాల మరియు ప్రదేశాల స్థితిపై ప్రభుత్వ సర్వే, శిధిల చిహ్నాల పునరుద్ధరణ ప్రాజెక్టుల మంజూరు మరియు నిధుల కేటాయింపు, ఖర్చు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. దీనికి కేంద్ర సాంస్కృతిక మరియు పర్యాటక శాఖామాత్యులు గజేంద్ర సింగ్ షెఖావత్ సమాధానమిస్తూ దేశంలో మొత్తంలో భారత పురావస్తు సర్వే సంస్థ పరిధిలో రక్షిత స్మారక చిహ్నాలు మరియు ప్రదేశాలు 3,685 ఉన్నవని, నిర్ణీత సమయాలలో ఈ సంస్థ తనిఖీలు నిర్వహించి, స్మారక చిహ్నాల,ప్రదేశాల ప్రస్తుత పరిస్థితులను తెలుసుకొని, ప్రస్తుతానికి అన్ని స్మారక చిహ్నాలు మరియు ప్రదేశాల స్థితి బాగానే వున్నదని తెలిపారు. స్మారక చిహ్నాలు,ప్రదేశాల పునరుద్ధరణ ప్రాజెక్టుల క్రింద దేశం మొత్తంలో 2020–21 నుండి 2024–25 వరకు రూ. 1,416.61 కోట్లు కేటాయించగా, రూ. 1,294.32 కోట్లు ఖర్చు చేయబడిందని, రాష్ట్రానికి 2020–21 లో రూ. 4.57 కోట్లు, 2021–22 లో రూ.5.75 కోట్లు, 2022–23లో రూ.11.60 కోట్లు, 2023–24లో రూ.14.70 కోట్లు ,2024–25లో రూ. 6.50 కోట్లు కేటా యించగా, మొత్తం ఖర్చు చేయబడిందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలం లోని మట్టిగుంట గ్రామంలో పంచాయితీ సెక్రటరీ బెనహర్ ఆధ్వర్యంలో పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు పారిశుద్ధ్య సిబ్బంది గ్రామంలోని విధులు వెంట ఎబెట్ ద్రావణం పిచికారి చేయించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ లు కూడా ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

ప్రకాశం జిల్లా వాసికి అరుదైన ఆహ్వానం

విశాలాంధ్ర-పెద్దారవీడు : దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ సెషన్స్ జరుగుతున్న నేపథ్యంలో ఆగస్టు ఒకటవ తేదీన పార్లమెంట్ స్టడీ టూర్ కి రాష్ట్రం నుంచి 9 మందిని ఎంపిక చేసారు.వారిలో ప్రకాశం జిల్లా వాసి జీవీ రెడ్డి అవకాశం దక్కింది, ప్రస్తుతం వారు భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్,ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇతను ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన జీవీ రెడ్డి ఇతను చేస్తున్న సాఫ్ట్వేర్ జాబ్ని వదిలేసి భారతీయ జనతా పార్టీలో చేరి నమ్మిన సిద్ధాంతం కోసం గత కొన్ని సంవత్సరాలుగా ప్రజా సమస్యల మీద పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కష్టపడుతున్న వ్యక్తికి ఇలాంటి గౌరవం దక్కడం అదృష్టం. భారతీయ జనతా పార్టీ ఆ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించి సముచిత స్థానం కల్పించడం బీజేపీ పార్టీకే తెలుసు. ఈ సందర్భంగా జీవి రెడ్డి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన బిజెవైఎం జాతీయ అధ్యక్షులు తేజస్వి సూర్య సారథ్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పార్లమెంట్ స్టడీ టూర్ కి నన్ను ఎంపిక చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్కి, రాష్ట్ర సంఘటనా మంత్రి నూకల మధుకర్కి, నన్ను వెన్ను తట్టి ముందుకు నడిపించే మా అన్న బీజేవైఎం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మిట్ట వంశీకృష్ణ కి, మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవనీత్ కృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అలానే నాతో పాటుగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన నాతోటి సహచర మిత్రులకి శుభాకాంక్షలు తెలియజేశారు.

5 నుంచి 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లాలో వచ్చే నెల 5వ తేదీన ఉద్యోగుల సమస్యలపై "రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం" అనే కార్యక్రమం కార్యాచరణను చేపట్టడం జరుగుతుందని ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉద్యోగుల సమస్యలు మరియు వారికి రావాల్సిన బకాయిలు సుమారు 25 వేల కోట్ల రూపాయల కు సంబంధించి దాదాపుగా 12 రకాల సమస్యలను నిత్యం "రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం" అనే ప్రోగ్రాం ద్వారా మూడు నెలల పాటు ప్రకాశం జిల్లాలో నిర్వహించబడుతుందని తెలియజేశారు. ఈ మూడు నెలల కాలంలో వారానికి ఒక సమస్యను లేవనెత్తుతు "రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం" అనే ప్రోగ్రామ్ నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు అందులో భాగంగా నిర్వహించబోయే "రండి టీ తాగుతు మాట్లాడుకుందాం" అనే కార్యక్రమంలో ముందుకు ఎలా తీసుకెళ్లాలో అనే విషయమై ఈరోజు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ,పట్టణ మరి తాలూకా ఆఫీసు బేరర్ లకు సూచించడం జరిగిందని చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర కుమార్ కోశాధికారి రంగారెడ్డి ,పట్టణ అధ్యక్షులు మోటార్ శ్రీనివాస్ గౌడ్ ,కోశాధికారి ఏసురత్నం మెయిల్ బాబు అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా,వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఒంగోలు : అందరికీ విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని గత 50 సంవత్సరాలుగా రాజీలేని పోరాటం చేస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యూ), విద్యార్థుల్లో శాస్త్రీయ భావజాలం పెంపొందించాలని, మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావజాలానికి వ్యతిరేకంగా పీడీఎస్యూ ఆధ్వర్యంలో విద్యార్థులను చైతన్య పరిచేందుకు ఆగస్టు 4, 5, 6 తేదీలలో నంద్యాల పట్టణంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి విజ్ఞా,వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని పిడిఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ పిలుపునిచ్చారు.

కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ ఒంగోలు నగరంలోని ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో జరిగింది. కార్యక్రమంలో పిడిఎస్ యూ రాష్ట్ర నాయకులు సిసింద్రీ బాబు, జిల్లా అధ్యక్షుడు శ్యామ్, ఒంగోలు నగర నాయకుడు సచిన్, యూనివర్సిటీ నాయకుడు హరి శ్రీనివాస్,విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

2న ధర్నాను విజయవంతం చేయండి:ఫ్యాప్టో

విశాలాంధ్ర -ఒంగోలు : ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అపరిష్కృత సమస్యల పరిష్కారం నిమిత్తమై జిల్లాస్థాయిలో ఆగస్టు 2వ తేదీన తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ప్రకాశం జిల్లా ఫ్యాప్టో పిలుపునిచ్చింది. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో చైర్మన్ కె ఎర్రయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ బడుల్లో పనిచేసే ఉపాధ్యాయులను బోధనేతర పనులను నుండి మినహాయింపు ఇవ్వాలని బోధనకి పరిమితం చేయాలని బోధనను హరించే యాప్లను పూర్తిగా రద్దు చేయాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాలని బకాయిలు వెంటనే చెల్లించాలని, పిఆర్సి కమిషన్ను వేసే ముందు ఐ.ఆర్ 30శాతం ప్రకటించాలని తదితర 18 డిమాండ్లతో కూడిన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంఈఓ -1 పోస్టులను కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులను నుండి మాత్రమే నియమించడం ఇచ్చిన జీవోను ఫ్యాప్టో తీవ్రంగా వ్యతిరేకిస్తుందని జడ్పీ గవర్నమెంట్ మేనేజ్మెంట్ నుండి సంయుక్త సీనియారిటీ ప్రాతిపదిక నియమించాలని, రెండవ తేదీన జరిగే ధర్నాను ప్రతి హై స్కూల్, ప్రాథమిక ఉన్నత పాఠశాల నుండి 50 శాతం మంది ఉపాధ్యాయులు తగ్గకుండా హాజరై జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశం నందు ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల నాయకులు ఎస్మే ఎండి రఫీ సెక్రెటరీ జనరల్ , హెచ్ఎఫ్ అసోసియేషన్ వై వెంకట్రావ్ , డిప్యూటీ సెక్రటరీ జనరల్ షేక్ అబ్దుల్ హై, డి శ్రీనివాసులు ఏపీటీఎఫ్ 257, బి వెంకట్రావు వై వెంకట్రావ్ , చల్ల శ్రీనివాసులు, డి వీరాంజనేయులు, ఎస్ రవి ,డి శ్రీనివాసులు, పి వెంకట్రావు పి సుబ్బారావు ఎన్ చిన్న స్వామి, వై వెంకట్రావు, పాల్గొన్నారు.

రైతులకు కౌలు కార్డు తప్పనిసరి

విశాలాంధ్ర-సి ఎస్ పురం : కౌలుకు భూమి తీసుకొని సాగు చేసేటటువంటి ప్రతి రైతు తప్పనిసరిగా గ్రామ రెవెన్యూ అధికారి దగ్గర కౌలు కార్డుకు అప్లై చేసుకొని కౌలు కార్డు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. మధుబాబు తెలిపారు. చంద్రశేఖరపురం మండలంలోని ముండ్లపాడు, డి.టి.పల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా పంట సాగుదారు హక్కు పత్రం (కౌలు కార్డులు) పై రైతులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంభందించి అర్హులైన రైతుల జాబితా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉందని, పచ్చిరొట్ట విత్తనాలు అయిన జీలుగ, జనుము, పిల్లి పెసర కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం లోని అధికారులను సంప్రదించాలని తెలిపారు .కౌలుకు పొలం తీసుకొని సాగు చేసేటటువంటి రైతులు కౌలు కార్డు తీసుకోవడం వలన రుణం, ప్రభుత్వం అందించే పంటల బీమా, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ శాఖ నుండి వచ్చేటటువంటి రాయితీలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టానికి గల రాయితీలు పొందుటకు ప్రయోజనాలు కలుగుతాయని తప్పనిసరిగా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం ఉండవలెనని తెలిపారు పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వడం వలన భూమి యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు కౌలు రైతులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, దేవాదాయ భూములకు కూడా పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వవచ్చునని, మండలంలోని కౌలుకు సాగు చేసేటటువంటి రైతులందరూ మీ గ్రామ రెవెన్యూ అధికారి లేదా రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయమరియు ఉద్యాన సహాయకులు సంప్రదించి పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలని తెలియజేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వి. శ్రీకాంత్ మరియు ఆయా గ్రామాలలోని రైతులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తిలోని సాంఘిక గురుకుల సంక్షేమ పాఠశాల నందు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చీమకుర్తి సీ.ఐ.,ఎం.సుబ్బారావు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లా స్త్రీ,శిశు, సంక్షేమ మరియు సాధికారితాధికారిని సువర్ణ వారి ఆధ్వర్యంలో సి.డి.పి.ఓ. ఇవాంజిలీ అధ్యక్షతన జిల్లా బాలల సంరక్షణ విభాగం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా బాలల సంరక్షణ విభాగం బాలల రక్షణ అధికారి శ్రీలక్ష్మి కార్యక్రమంలో పాల్గొని మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం గురించి వివరించారు. సి.ఐ.,ఎం. సుబ్బారావు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు పట్ల పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పిల్లలకి ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1098 కి కాల్ చేసి పిల్లలు అపాయం నుంచి రక్షించుకోవాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సి.హెచ్.శైలజ, చీమకుర్తి టౌన్ సి.ఐ,ఎం. సుబ్బారావు,ఎమ్మెస్.కే.,ఎం. కోటేశ్వరమ్మ, ఎస్.శోభారాణి, స్కూల్ సిబ్బంది మరియు అంగన్వాడి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల జాగ్రత్త

విశాలాంధ్ర - గిద్దలూరు : అపరిచితుల పట్ల జాగ్రత్తగా వివరించాలని న్యాయవాదులు రవి ప్రకాష్ బాబు, చల్లగాలి పోలయ్య, మోడీ పిచ్చయ్యలు తెలిపారు. మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో వసతి గృహాల్లో అక్రమ రవాణా పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ఖరీదైన మానవ అవయవముల కోసం అక్రమ లాభం పొందడం కోసం సంఘ వ్యతిరేక వ్యక్తులు ఈ మానవ అక్రమ రవాణా చేపడుతున్నారని వారి పట్ల బాలురు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు .ఈ కార్యక్రమంలో ట్రైబల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి .వెంకటేశ్వర్లు నాయక్, పారా లీగల్ అడ్వైజర్ మధుసూదన్ రావు, ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ బి. ఆంజనేయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ను కలిసిన బొట్లా రామారావు

విశాలాంధ్ర-టంగుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాశం జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు బొట్లా రామారావును నియమించారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యాలయంలో వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని బొట్లా రామారావు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఆయనతో రామారావు మాట్లాడుతూ నా పై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియామకం చేసి నన్ను గౌరవించారని, నేను శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని, మరలా మిమ్ములను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పార్టీ కార్యకర్తలు, ప్రజలతో మమేకమై మన పార్టీ ని బలోపేతం చేసి మంచి ఫలితాలు సాధించే విధంగా పార్టీ ఆదేశాలు, పెద్దల సూచనల మేరకు ప్రణాళిక బద్ధంగా పనిచేస్తానని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి మనస్ఫూర్తిగా తన ఆశీస్సులు ఉంటాయని శుభాకాంక్షలు చెప్పారు.

రైతులకు యాజమాన్య పద్ధతిలో శిక్షణ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని పెద్ద పిఆర్సి తండా ముటుకుల గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం జరిగింది. 2025 క్రింద ఖరీఫ్ సీజన్ నందు సాగు చేసే పంటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వ్యవసాయ శాఖ నందు అమలులో ఉన్న పథకాలు, విత్తన సరఫరా మొదలైన అంశాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పుల్లలచెరువు వ్యవసాయ అధికారి వి గోపికృష్ణ ఏఈఓ మంత్రు కోటేశ్వరరావు నాయక్ రైతుసేవకేంద్రం లక్ష్మి, మరియు రైతులు పాల్గొన్నారు.

నాంచారయ్య కుటుంబానికి బీఆర్కే పరామర్శ

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సున్నంపూడి రాజేష్ తండ్రి సున్నంపూడి నాంచారయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ బుధవారం నిజాంపట్నంలో మృతుడు సున్నంపూడి నాంచారయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి కొంత ఆర్థిక సహాయం అందజేశారు. సున్నంపూడి నాంచారయ్య సౌమ్యుడు, మంచి వ్యక్తి అని అలాంటి వ్యక్తి మృతి చెందటం బాధాకరమని బొమ్మిడి రామకృష్ణ విచారం వ్యక్తం చేశారు. అధైర్య పడవద్దని అండగా ఉంటానని మృతుడు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అయనతో పాటు టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్, టీడీపీ నాయకులు నాయుడు నరసింహామూర్తిలు ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నేటి సమాజంలో పలు రూపాలలో మానవ అక్రమ రవాణా జరుగుతుందని దీనిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్ అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళ శిశు సంక్షేమ సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ నందు సమావేశం నిర్వహించడం జరిగింది. శిశు సంక్షేమ శాఖ పీడీ రాధా మాధవి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. బాల కార్మిక, బాల్య వివాహ అక్రమ రవాణా పై సిఫార్డ్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని తెలియజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం మాట్లాడుతూ దేశంలో అనేక ప్రాంతాల్లో, పలు రూపాల్లో మానవ అక్రమ రవాణా జరుగు తుందని దీనిని రూపుమాపటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల న్నారు. ప్రతి పాఠశాలలో దీనిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయుటకు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని తెలియజేశారు. సిఫార్డ్ సంస్థ డైరెక్టర్ కె.రవి ప్రదీప్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాను బాల కార్మిక, బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుటకు మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా కృషి చేయడం జరుగుతుందని తెలియజేశారు. బాపట్ల మండల ప రిషత్ అధికారి బాబురావు మాట్లా డుతూ మండల పరిధిలోని గ్రామా లలో మహిళా సంరక్షణ కార్యదర్శుల ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఆర్పిఎఫ్ సిఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ట్రైన్లలో అక్రమ రవాణాకు గురవుతున్న బాలలను సిఫార్డ్ వారి సహకారంతో గుర్తించి, అక్రమ రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ పి పురుషోత్తమరావు, బాలల సంరక్షణ అధికారి జి కృష్ణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయి జ్యోతి,సిఫార్డ్ కోఆర్డినేటర్ బడుగు కిషోర్, నాగరాజు, సిడిపిఓలు, అంగన్వాడి సూపర్వైజర్లు,రామకృష్ణ,జ్యోతి, పోలీస్ సిబ్బంది,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- బ్యాంకు మేనేజర్లకు ఎస్ఐ సూచన

విశాలాంధ్ర - నిజాంపట్నం : బ్యాంకుల వద్ద పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని నిజాంపట్నం ఎస్ఐ కందుల తిరుపతిరావు బ్యాంకు మేనేజర్లకు సూచించారు. బుధవారం నిజాంపట్నం పోలీస్ స్టేషన్ లో మండల కేంద్రంలో ఉన్న వివిధ బ్యాంకుల మేనేజర్లతో ఎస్ఐ కందుల తిరుపతిరావు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల యొక్క భద్రత దృష్ట్యా సెక్యూరిటీ గార్డ్స్ ని నియమించుకోవాలని అలాగే సీసీ కెమెరాలు, అలారమ్స్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల నివారణ పట్ల ఖాతాదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని కోరారు. నిజాంపట్నం పోలీస్ స్టేషన్ నుంచి బ్యాంకు వారికి 24 గంటలు బిట్స్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఏదైనా అవసరమైతే వారి యొక్క సేవలను కూడా వినియోగించుకోవాలని ఎస్ఐ చెప్పారు. ఈ సమావేశంలో నిజాంపట్నం మండల కేంద్రంలోని ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్, కోస్టల్ బ్యాంక్, జీడీసీసీ బ్యాంకుల మేనేజర్ పాల్గొన్నారు.

స్వామిత్వ పథకంపై కార్యదర్శులకు అవగాహన

విశాలాంధ్ర - సంతమాగులూరు : కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ రూపొందించిన స్వామిత్వ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా 9 రాష్ట్రాల్లో చేపట్టి, విజవంతంగా పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీవో జ్యోతిర్మయి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు స్వామిత్వ పథకం అమలు తీరుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ చేతులు మీదుగా స్వామిత్వ పథకాన్ని 2021లో ఏప్రిల్ 2న దేశవ్యాప్తంగా ప్రారంభించినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి భూమి హద్దులు మ్యాపింగ్ చేయడం సులభంగా మారిందని తెలిపారు. అలాగే గ్రామంలో ఉన్న గృహాల యజమానులకు హక్కుల రికార్డులను అందించడంతో చట్టబద్ధంగా యాజమాన్య కార్డులు (ఆస్తి, టైటిల్ డీడ్‌లు) జారీ చేస్తారని వివరించారు. అదే విధంగా గ్రామీణ నివాసిత (అబాది) ప్రాంతాల్లో ఆస్తిపై స్పష్టమైన యాజమాన్యం స్థాపనకు స్వామిత్వ పథకంతో విప్లవాత్మకమైన మార్పులు తెస్తుందన్నారు. ఇందులో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖతో పాటు రాష్ట్ర రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివరామకృష్ణప్రసాద్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామి పుట్టకు షెడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం గ్రామంలోని ఫిషర్మెన్ కాలనీలో కొల్లాటి నాగేశ్వరరావు ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డు గదిలో 11 సంవత్సరాల క్రితం నాగేంద్ర స్వామి పుట్ట వెలిసింది. దీంతో ఆ ఇంటికి చెందిన కొల్లాటి నాగేశ్వరరావు దంపతులు నాగేంద్ర స్వామి పుట్ట వెలిసినప్పటి నుంచి ఆ స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రజలు కూడా పుట్టను సందర్శించి నాగేంద్ర స్వామికి పూజలు చేస్తూ ఉంటారు. అయితే ఆ పుట్ట ఉన్న షెడ్డు గది కొంత మేర శిథిలావస్థకు చేరింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ బుధవారం నాగేంద్ర స్వామి పుట్టను సందర్శించి పరిశీలించారు. ఈ మేరకు తన సొంత ఆర్థిక ఖర్చులతో నాగేంద్ర స్వామి పుట్టకు నూతన రేకుల షెడ్డుతో గది నిర్మాణం చేపడతానని చెప్పారు. నాగేంద్ర స్వామి వారి సేవలో భాగంగా ఇలాంటి అవకాశం తనకు రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని బొమ్మిడి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర స్వామి పూజ నిర్వాహకులు కొల్లాటి నాగేశ్వరరావు దంపతులు అలాగే స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ బొమ్మిడి రామకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అయన వెంట టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్, టీడీపీ నాయకులు నాయుడు నరసింహామూర్తి తదితరులు ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

విశాలాంధ్ర - వేటపాలెం : ఈనెల 25 నుండి 27 వరకు విజయవాడలో టైక్వాండో నేషనల్ ఓపెన్ పోటీలు నిర్వహించగా ఈ పోటీల్లో వేటపాలెం గర్ల్స్ హైస్కూల్ లో చదువుచున్న అక్కాచెల్లెళ్లు యార్లగడ్డ లక్ష్మీ ప్రియ , లాస్య ప్రియ పాల్గొని కాంస్య, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రార్థన సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సరోజిని, వ్యాయామ ఉపాధ్యాయులు జె. దేవకిష్టం, జె. శ్రావణి, ఉపాధ్యాయులు అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎస్ఐ బత్తుల బాబురావు

విశాలాంధ్ర - నిజాంపట్నం : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అడవులదీవి ఎస్ఐ బత్తుల బాబురావు అన్నారు. బుధవారం మండలంలోని ప్రజ్ఞం జడ్పీ హై స్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ లాంటివి చేయకూడదని స్నేహభావంతో మెలగాలని చెప్పారు. విద్యార్థులు, యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, వాటి జోలికి వెళ్లి బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమ శిక్షణతో మంచిగా చదువుకోవాలని చెప్పారు. అలాగే విద్యార్థులు రోడ్డు ప్రమాదాల నివారణ జాగ్రత్తలు, ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు వారి లక్ష్యాలపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని ఎస్ఐ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కొలసాని రమేష్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలకు బీమా.. రైతన్నకు ధీమా

విశాలాంధ్ర - సంతమాగులూరు : కుందుర్రు, పరిటాలవారిపాలెం గ్రామాల రైతులు తప్పనిసరిగా పంటలకు బీమా చేయించుకోవాలని సంతమాగులూరు మండల వ్యవసాయ అధికారి షేక్.సైదా సూచించారు. బుధవారం ఆయా గ్రామ సచివాలయాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ.. పత్తి, మిరప పంటలకు గురువారంతో ఈక్రాప్ నమోదు గడువు ముగుస్తుందని, వరికి ఆగస్టు 15వరకు నమోదుకు అవకాశం ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హులైన అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది అజయ్, పరమేశ్వరి పాల్గొన్నారు.